800 స్టోర్లకు మెట్రో బ్రాండ్ విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ పాదరక్షల బ్రాండ్ మెట్రో బ్రాండ్ 800 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. బంజారాహిల్స్‌లో తమ బ్రాండ్ ఫిట్ ఫ్లాప్ నూతన స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరినట్లు పేర్కొంది. ఇది తమ వృద్ధికి నిదర్శనమని వెల్లడించింది. ఈ బ్రాండ్ కింద ఫిట్‌ఫ్లాఫ్, ఫిలా, మెట్రో స్టోర్స్ విస్తరించి ఉన్నాయి.

'ఇఫ్లూ'లో లైంగిక వేధింపులు

- నిందితులను శిక్షించాలని దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇఫ్లూ యూనివర్సిటీలో విద్యార్థినిని లైంగికంగా వేధించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలికి అండగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాశ్‌నగర్‌లో శనివారం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడులకు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఇఫ్లూ యూనివర్సిటీలో సిసి కెమెరాల పర్యవేక్షణ లేదని, సరైన వీధిలైట్లు కూడా లేని దుస్థితి ఉన్నారు. అక్కడి అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దుండగులను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టి శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు విశాల్ నగర ఉపాధ్యక్షులు దీపిక, నాయకులు గంగ ప్రసాద్, రాహుల్, కార్తీక్, ఆజాద్, దుర్గా, శైలజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

300 కోట్ల రూపాయలు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ ఎన్నికల తనిఖీల్లో భాగంగా పట్టుబడిన నగదు, మద్యం, ఆభరణాలు, కానుకల విలువ శనివారం నాటికి మొత్తం రూ.300 కోట్ల మార్క్ దాటింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన అక్టోబరు 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో పట్టుబడిన సొత్తు విలువ రూ.307.2 కోట్లకుపైగా ఉన్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు. గడచిన 24 గంటల్లో రూ.9.69 కోట్ల నగదు పట్టుబడగా, ఇప్పటి వరకు పట్టుబడిన మొత్తం నగదు రూ.105.58 కోట్లు. శుక్రవారం ఉదయం నుంచి రూ.1.35 లక్షల విలువైన మద్యం పట్టుబడగా.. స్వాధీనం చేసుకున్న మొత్తం సరకు విలువ రూ.13.58 కోట్లు. 24 గంటల్లో రూ.72 లక్షల విలువైన 232 కిలోల గంజాయి పట్టుబడింది. గడచిన 24 గంటల్లో రూ.3.81 కోట్ల విలువైన బంగారం, 894 కిలోల వెండి, 190 క్యారెట్ల వజ్రాలు, 5 గ్రాముల ప్లాటినం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.145.67 కోట్లు. వీటితో పాటు రూ.26.93 కోట్ల విలువైన ఇతర కానుకలు పట్టుబడ్డాయి.

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే

- సిఎంను అవినీతిపరుడంటారు.. అయినా చర్యలు తీసుకోరు?
- ఎంఐఎం అధినేతను నిఘా సంస్థలు ముట్టుకోవు
- ప్రజా సంఘాల మ్యానిఫెస్టోల విడుదల సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్

మేనిఫెస్టోలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని జస్టిస్ చంద్రకుమార్ విమర్శించారు. తెలంగాణ సమాఖ్య (సంఘాలు) ఆర్గనైజింగ్ కన్వీనర్ కరుణాకర్ దేశాయి అధ్యక్షతన శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ సమాఖ్య సంఘాల ఉమ్మడి మేనిఫెస్టో, ప్రజాసంఘాల మేనిఫెస్టోల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు పదే పదే సిఎం కెసిఆర్‌కు కాళేశ్వరం ఎటిఎంలాగా మారిందని విమర్శలు చేస్తారే తప్ప... చర్యలెందుకు తీసుకోరని ప్రశ్నించారు. ఎంఐఎం అధినేత ఓవైసీ మైనార్టీల భద్రత, సంక్షేమం కోసం ఉన్నానంటూ చెప్పుకుంటూ వివిధ రాష్ట్రాల్లో స్వల్ప మెజారిటీతో బిజెపి ఓడిపోయే స్థానాల్లో కమలాన్ని గెలిపించేందుకు అక్కడికెళుతుంటారని విమర్శించారు. ఇప్పటి వరకు ఎంఐఎం పార్టీ పోటీ చేసిన వివిధ రాష్ట్రాల నియోజకవర్గాలను పూర్తిగా పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమైందని తెలిపారు. ఈ మూడు పార్టీలు బయటికి మాత్రమే విమర్శలు చేసుకుంటూ, లోపల లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నాయని చెప్పారు.

మతోన్మాద బిజెపిని ఓడించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఆ పార్టీకి సహకరిస్తున్న బిఆర్ఎస్, ఎంఐఎంలను కూడా ఓడించేందుకు ఓట్ల చీలిక జరగకుండా ప్రజాసంఘాలు ప్రయత్నించాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా నిలబడ్డ ప్రజాస్వామిక అభ్యర్థులను, వారూ లేని చోట కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బిజెపి మనుష్యుల మధ్య విద్వేషాలు పెంచుతూ, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసిందనీ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్నదనీ, బ్యాంకుల నుంచి లక్షల కోట్ల రూపాయలు తీసుకుని ఎగవేసిన వారిని వదిలేసిందనీ, నల్లడబ్బు బయటికి వెలికి తీయలేదని విమర్శించారు.ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ పాలకులతో పాటు పాలనా విధానం కూడా మారాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీతో ప్రభుత్వ ఆదాయం తగ్గిందన్నారు. విచ్చలవిడి జరిమానాలతో ప్రజలను చితకబాదుతున్నారని తెలిపారు. అప్పులు తెచ్చినా కాళేశ్వరం పూర్తి చేయలేదనీ, దక్షిణ తెలంగాణ పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని విమర్శించారు. ప్రజా సంఘాల కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ అడ్డు కాదని స్పష్టం చేశారు. 40 రోజులు ప్రజల మధ్యకు ఐక్యంగా వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వంతో జరిగిన నష్టాన్ని వివరించాలని సూచించారు. సుప్రీంకోర్టు న్యాయవాది నిరూప్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో ప్రజా సంఘాలు ప్రత్యామ్నాయ పాలన రావడానికి చేసిన ప్రయత్నాలను వివరించారు. ప్రధాని మోడీ ప్రచారం చేసిన ప్రతి నియోజకవర్గంలో బిజెపి ఓడిపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటున్న ప్రత్యామ్నాయం రావడానికి ఇక్కడి ప్రజా సంఘాల అలాంటి క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమలంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సమాఖ్య ఉమ్మడి మేనిఫెస్టో 28 ప్రజాసంఘాల మేనిఫెస్టోలను విడుదల చేశారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకు

- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసు అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శనివారం సైబరాబాద్ కమిషరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్మారక స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. పోలీసులు జాతి సేవకు పునరంకితం కావాలన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను నిత్యం స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశ భద్రత చూసుకునే బాధ్యత సైనికులదైతే, దేశంలోని అంతర్గత భద్రత చూసుకునే బాధ్యత పోలీసులదని చెప్పారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం, నష్టం, వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసేనని తెలిపారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు ప్రజారక్షణ, శాంతి పరిరక్షణ కోసం నిరంతరం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకి.. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల కోసం చేసిన త్యాగానికి గౌరవం చూపించడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు 189 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ అడిషనల్ సిపి అడ్మిన్ అవినాష్ మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి నారాయణ్‌నాయక్, డిసిపి అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, బాలానగర్ డిసిపి శ్రీనివాసరావు, మాదాపూర్ డిసిపి సందీప్, శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి, మేడ్చల్ డిసిపి శబరీష్, డిసిపి రోడ్ సేఫ్టీ ఎల్‌సి నాయక్, సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ ఎడిసిపి షమీర్, సీస్‌డబ్ల్యూ ఎడిసిపి శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

రామకృష్ణ శర్మ కవిత్వం సామాజిక చింతన మిళితం : వక్తలు

ప్రజాశక్తి - కల్చరల్

వేమూరి రామకృష్ణ శర్మ కవిత్వం సామాజిక చింతన మిళితమని ప్రముఖులు ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని గుండు హనుమంతరావు కళా వేదికపై దసరా సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహణలో కవి సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ పాల్గొని రామకష్ణ శర్మను సత్కరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ విమర్శకుడు రామకష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ భాష భావంలో స్పష్టత శర్మ కవితలో ఉన్నాయని అభినందించారు. విశ్వ సాహితీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జయ రాములు, పాలడుగు సరోజిని తదితరులు పాల్గొన్న సభకు బడే సాబ్ స్వాగతం పలికారు.

ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలి

- సిఎస్ శాంతికుమారి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎస్ శాంతికుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ రాజీవ్ శర్మతోపాటు సచివాలయంలోని వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్, పింగాణీ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటికే ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్లాస్టిక్ నిషేధాన్ని సచివాలయ స్థాయిలో స్వచ్ఛందంగా పాటిస్తూ ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ప్లాస్టిక్‌లో కేవలం 9 శాతం మాత్రమే రీ సైక్లింగ్ జరుగుతోందని, మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాలు, చెరువులు, నదీ జలాల్లో కలుస్తూ జీవనానికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 17 లక్షల మంది స్వయం సహాయక బృందాల మహిళలతో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై పౌరులను చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిగ్రామంలో చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తున్నట్లు వివరించారు. కేవలం ప్రభుత్వ ఉత్తర్వులతో సాధ్యం కాదని.. స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో పాటించాలన్నారు. కాలుష్య నివారణ మండలి చైర్మన్ రాజీవ్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యక్తిగతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటికే జిల్లాస్థాయిలో కమిటీలు ఉన్నాయన్నారు. ప్రజా చైతన్య కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో చేపట్టాలని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో వినియోగించే ప్రత్యామ్నాయ వస్తువులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను సీఎస్ శాంతికుమారి ప్రారంభించగా.. ఈ వర్క్‌షాప్‌కు హాజరైన కార్యదర్శులు, ఉన్నతాధికారులు సందర్శించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి భూమిని కాపాడుకొందాం అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ధిక్కార స్వరాలు

- బిఆర్ఎస్‌లో పెరుగుతున్న నిరసన గళాలు
- సీటివ్వకపోయినా తమ బలాన్ని చూపిస్తామంటున్న ఆశావహులు
- కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే రేఖా నాయక్
- రెబల్ అభ్యర్థిగా మాజీ స్పీకర్ మధుసూదనాచారి తనయుడు
- పటాన్‌చెరులో సత్తా చాటుతానంటున్న నీలం మధు
- జహీరాబాద్‌లో 'గులాబీ'కి షాకిచ్చిన ఢిల్లీ వసంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల పట్ల ఇన్నాళ్లూ 'ధిక్కారమును సైతునా...' అన్నట్టు వ్యవహరించిన ఆర్ఎస్‌కు ఇప్పుడు సొంత పార్టీ నుంచే 'ధిక్కార స్వరాలు' వినబడుతున్నాయి. పార్టీ నుంచి సీటిచ్చినా, ఇవ్వకపోయినా కచ్చితంగా పోటీ చేసి తీరతామంటూ పలువురు నేతలు, ఆశావహులు తేల్చి చెబుతున్నారు. అభ్యర్థుల మీద వ్యతిరేకత, కర్ణాటక ఫలితాల ప్రభావం, కాంగ్రెస్‌కు సానుకూల వాతావరణంతో ఇప్పటికే కొంతలో కొంత ఇబ్బందికి గురవుతున్న గులాబీ పార్టీకి ఇప్పుడు 'రెబల్స్' బెడద మరిన్ని చిక్కులు తెచ్చే ప్రమాదం పొంచి ఉంది. తొలి జాబితాలోనే 115 మంది అభ్యర్థులను ప్రకటించటం, వారిలో వంద మందికి బీ-ఫామ్‌లు అందజేసిన నేపథ్యంలో తమకు ఇక అధికార పార్టీ నుంచి సీటు వచ్చే అవకాశం లేదని తెలిసిన నేతల్లో కొందరు పార్టీ మారుతుండగా, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాగా, మరికొందరు యువ నాయకులు ఉన్నారు.

భూపాలపల్లి నుంచి గత ఎన్నికల్లో గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి (కాంగ్రెస్‌లో గెలిచి, ఆ తర్వాత కారెక్కారు)కే ఈసారి కూడా బిఆర్ఎస్ టిక్కెటిచ్చింది. అక్కడి నుంచి 2014లో గెలిచిన మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు ప్రశాంత్ రూపంలో బిఆర్ఎస్‌కు గండం ఎదురవుతున్నది. నియోజకవర్గంలో గండ్ర కుమారుడి వేధింపులు తట్టుకోలేకపోతున్నామంటూ మాజీ స్పీకర్ తనయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. అందువల్ల తాను కచ్చితంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానంటూ ప్రశాంత్ చెబుతూ వస్తున్నారు. ఆసిఫాబాద్‌లో సీటు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్... కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. ఇక ఇప్పటి వరకూ టిక్కెట్ ఎవరికిచ్చినా కచ్చితంగా మద్దతిస్తాననీ, సిఎం కెసిఆర్ మాటే వేదవాక్కంటూ చెప్పిన బోథ్ ఎమ్మెల్యే బాపూరావు... ఇప్పుడు నిరసన గళం విప్పుతున్నారు. తాను కూడా పోటీలో ఉండి తీరతానంటూ బిఆర్ఎస్ అధిష్టానానికి హెచ్చరికలు పంపారు.

కారుకు 'ముదిరాజ్'ల ముప్పు

మరోవైపు రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గమైన ముదిరాజ్‌లు ఈసారి బిఆర్ఎస్‌పై గుర్రుగా ఉన్నారు. ఇప్పటి వరకూ ప్రకటించిన 115 స్థానాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా తమ సామాజిక తరగతికి ఇవ్వలేదంటూ వారు వాపోతున్నారు. అందువల్ల బిఆర్ఎస్‌కు కచ్చితంగా తమ సత్తా చూపుతామంటూ వారు హెచ్చరిస్తున్నారు. ఆ సామాజిక తరగతి నుంచి పటాన్‌చెరు నియోజకవర్గంలో మొదటి నుంచి టిక్కెట్ ఆశిస్తూ వచ్చిన నీలం మధుకు గులాబీ పార్టీ మొండి చేయి చూపింది. దీంతో ఆయన నియోజకవర్గం మొత్తం పర్యటిస్తూ తమ సామాజిక తరగతికి అన్యాయం జరిగిందంటూ ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాల రూపంలో బిఆర్ఎస్‌కు వార్నింగ్ పంపారు. అయినా ప్రగతి భవన్ నుంచి పిలుపు రాకపోవటంతో ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఆ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారు. హస్తం పార్టీ టికెట్ ఇస్తే ఓకే..లేదంటే ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశముందని మధు సన్నిహితులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో 'ముదిరాజ్'ల ప్రభావం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కచ్చితంగా పడే అవకాశముంది. ముఖ్యంగా మెదక్, సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌తోపాటు మరికొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను అది ప్రభావం చేయనుంది.

గజ్వేల్‌లో సిఎం కెసిఆర్‌పై పోటీ చేయనున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఇది సానుకూలాంశంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతుండటం గమనార్హం. సిఎం కెసిఆర్ ఈ పరిణామాలన్నింటినీ గమనించే అదే సామాజిక తరగతికి చెందిన మామిళ్ల రాజేందర్ (టిఎన్‌జిఒ రాష్ట్ర మాజీ అధ్యక్షులు) చేత వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయించి, ఆ వెంటనే పార్టీలో చేర్చుకున్నారు. ఆయన చేరిక బిఆర్ఎస్‌కు ఏ మేరకు ఉపయోగపడుతుందో చూడాలి.

ఊహించని షాక్

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ వెంట నడిచిన ఢిల్లీ వసంత్ కుమార్... బిఆర్ఎస్‌కు ఊహించని షాకిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు మరోసారి టిక్కెట్ ఇవ్వటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తనకు టిక్కెట్ ఇస్తారనే ఆశతో చివరి దాకా ఎదురు చూసిన వసంత్... ఇటీవల బిజెపిలో చేరారు. 'ఇన్నాళ్లూ పార్టీనే నమ్ముకుని పని చేసిన నాకు టిక్కెట్ ఇవ్వలేదు, అందువల్ల ఈసారి నా సత్తా ఏంటో చూపుతా...' అంటూ ఆయన బిఆర్ఎస్‌కు హెచ్చరికలు పంపారు.

అబ్రహం ఏం చేస్తారో...?

ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకు చివరి నిమిషంలో ఎదురు దెబ్బ తగలనున్నట్టు సమాచారం. బిఆర్ఎస్ తొలి జాబితాలో ఆయన పేరున్నప్పటికీ... బీ-ఫామ్ మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ విషయమై చర్చించేందుకు గురువారం తెలంగాణ భవన్‌కు వచ్చిన అబ్రహంకు మంత్రి కెటిఆర్ అపాయింట్‌మెంట్ దక్కలేదు. దీంతో ఆయన నిరాశగా వెనుదిరిగారు. అబ్రహం స్థానంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అనుయాయుడు విజయుడుకు టిక్కెట్ దక్కనున్నట్టు సమాచారం. ఈ ఎపిసోడ్ మొత్తంలో వెంకటరామిరెడ్డి చక్రం తిప్పినట్టు వినికిడి. సిఎం కెసిఆర్ కచ్చితంగా ఆయనకే బీ-ఫామ్ ఇస్తారని తెలిసింది. మరి ఇదే జరిగితే ఇతర నేతల మాదిరిగా అబ్రహం కూడా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా? లేక పార్టీకి విధేయుడిగా ఉంటారా..? అనేది చూడాలి.

రెట్టింపైన సెంట్రల్ బ్యాంక్ లాభాలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 90 శాతం వృద్ధితో రూ.605.4 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.318.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రధాన ఆదాయాలు పెరగడానికి తోడు మొండి బాకీలు తగ్గడంతో ఆకర్షణీయ ఫలితాలు వచ్చాయని ఆ బ్యాంక్ తెలిపింది. 2022-23 క్యూ2లో 9.67 శాతంగా ఉన్న జిఎన్‌పిఎ గడిచిన త్రైమాసికంలో 4.62 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పిఎలు 2.95 శాతం నుంచి 1.64 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం క్యూ2లో బ్యాంక్ మొత్తం ఆదాయం 11.51 శాతం పెరిగి రూ.6,02,284 కోట్లకు చేరింది. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఇ రుణాల జారీలో 14.24 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ప్రతీ ఉద్యోగి సగటు వ్యాపారం రూ.18.60 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ2లో రూ.17.13 కోట్లుగా ఉంది.

తగ్గిన ఐడిబిఐ బ్యాంక్ మొండి బాకీలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఐడిబిఐ బ్యాంక్ నికర లాభాలు 60 శాతం పెరిగి రూ.1,323 కోట్లకు చేరాయి. మొండి బాకీలు తగ్గడంతో ఎల్ఐసి ఆధ్వర్యంలోని ఈ బ్యాంక్ మెరుగైన ఫలితాలను సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.828 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 4.90 శాతానికి తగ్గాయి. 2022 ఇదే సమయం నాటికి ఏకంగా 16.51 శాతం జిఎన్‌పిఎతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. నికర నిరర్థక ఆస్తులు 1.15 శాతం నుంచి 0.39 శాతానికి పడిపోయాయి. బ్యాంక్ నిరర్థక ఆస్తులు తగ్గడం, ఆదాయం పెరగడంతో ఐడిబిఐ లాభాల్లో మెరుగుదల కనబడింది.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.10,261 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023-24 జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికం(క్యూ2)లో 35.8 శాతం వృద్ధితో రూ.10,261 కోట్ల లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.7557.84 కోట్ల లాభాలు ఆర్జించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 23.8 శాతం పెరిగి రూ.18,308 కోట్లకు చేరింది. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.31,088 కోట్ల నుంచి రూ.40,697 కోట్లకు పెరిగింది. బ్యాంక్ జిఎన్‌పిఎ 2.76 శాతం నుంచి 2.48 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పిఎలు 0.61 శాతం నుంచి 0.43 శాతానికి పరిమితమయ్యాయి.

రుణాల జారీకి హెచ్‌డిఎఫ్‌సి 'ఎక్స్‌ప్రెస్‌వే'

ముంబయి : బ్యాంకింగ్ ఉత్పత్తులను అందించడానికి, వేగంగా రుణాలు జారీ చేయడానికి ఎక్స్‌ప్రెస్‌వే వేదికను అందుబాటులోకి తెచ్చినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ఈ వేదికపై సులభంగా వ్యక్తిగత, వ్యాపార, వాహన, గృహ, క్రెడిట్ కార్డ్ తదితర రుణాలు పొందవచ్చని పేర్కొంది. వినూత్న పద్ధతుల్లో ఖాతాదారులకు వేగవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొంది.

డూప్లికేట్ ఓట్లపై ఇసి నజర్

- హైదరాబాద్‌లో భారీగా ఉన్నట్లు గుర్తింపు
- తొలగింపు జాబితా రూపొందించాలని నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్

హైదరాబాద్‌లో డూప్లికేట్ ఓట్లపై ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టింది. వివిధ రాజకీయ పార్టీల ఫిర్యాదులతో పాటు స్వయంగా ఇసి పరిశీలకులు సేకరించిన సమాచారంలో సైతం డూప్లికేట్ (ఒకటి కన్నా ఎక్కువ చోట్ల) ఓట్లు ఉన్నట్లు తేలడంతో ఓటరు జాబితాలో మార్పులు చేయాలని ఇసి భావిస్తున్నట్టు తెలిసింది. మరణించిన వారి ఓట్లనూ యథాతథంగా కొనసాగించారని రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు నాలుగు మధ్య 2.60 లక్షల మంది మరణించిన వారి ఓట్లు తొలగించారు. అయినా ఇక్కడి జాబితాల్లో లక్ష వరకు మరణించిన వారి ఓట్లు ఉన్నట్లు పార్టీలు చెబుతున్నాయి. నియోజకవర్గం మారి మరోచోట ఓటు నమోదు చేసుకున్న వారికి.. పాత నివాసంలో ఓటు తొలగించే అంశాన్ని అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేశాయి. దీంతో మరోసారి నిబంధనల మేరకు వాటిని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాను పరిశీలించకుండా.. స్థానిక సంస్థలు జారీచేసిన మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఆయా ఓట్లు తొలగించి మమ అనిపించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 వేల వరకు డూప్లికేట్ ఓట్లను గుర్తించినట్లు సమాచారం. వాటిల్లో అధిక శాతం రెండు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న వారే ఎక్కువమంది ఉంటారని అధికారుల అంచనా. ఒకే నియోజకవర్గంలో ఒకే ఫొటోతో ఒకటికి మించి ఉన్న ఓట్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘమే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించింది. రాష్ట్రంలో ఇలాంటివి సుమారు 22 లక్షల ఓట్లు తొలగించారు. ఈ నెల 4న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ తరవాత గుర్తించిన డూప్లికేట్ ఓట్లను తొలగించే అవకాశం లేకపోవటంతో.. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆయా పేర్ల వద్ద 'తొలగింపు (డిలీటెడ్)' ముద్రతో జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 31 వరకు ఓటర్ల నమోదుకు వెసులుబాటు ఉంది. అప్పటివరకూ వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించి.. వచ్చే నెల 10న ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేయనున్నారు. మరణించిన, డూప్లికేట్ ఓట్ల వివరాలను ఆ జాబితాలో డిలీటెడ్ ముద్రతో నమోదు చేయనున్నట్టు సిఇఒ కార్యాలయం అధికారి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురి మృతి

హైదరాబాద్ బ్యూరో :

ట్రాక్టర్ అదుపుతప్పి వాగులో బోల్తా కొట్ట డంతో ముగ్గురు అక్క డికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కొల్యూర్‌లో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్యూర్ గ్రామానికి చెందిన మంగళి గోపాల్(40), ఈటల రామన్న (56), ఎంపల్లి మల్లేశం (32) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీ టైరు పంచర్ కావడంతో శనివారం ముగ్గురు కలిసి ట్రాక్టర్ ఇంజిన్‌పై బయలు దేరారు. ఈ క్రమంలో సింగూరు ఎడమ కాల్వలో ట్రాక్టర్ అదపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురు ట్రాక్టర్ కింద మృతి చెందారు.

In The Court of The I Addl. District Judge, Nellore, A.P.

I.A.No. 466/2022
C.M.A.No. 13/2017

Panchagnula Amruthavalli - Petitioner / Appellant

Vs

1. Panchagnula Ramakrishna (Died) and 13 others - Respondents

Notice

R8. Panchagnula Bujji,
W/o Late **Ramakrishna,**
R9. Panchagnula Pradeep,
S/o Late **Ramakrishna,**
R10. Panchagnula Indraseena,
W/o Late **P. Venkateswarlu,**
R11. Panchagnula Mohan,
S/o Late **P. Venkateswarlu,**
R8 to R11 residing at C/o Prasad Rao, HNT27, Mandamarri, Kalyanekevy, Adilabad District T.S.

పై నెంబరు కేసులో పిటిషనరు/ అప్పీలెంటు మీపై వారి కోర్టులో ప్రపోజ్డ్ పార్టీ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే31-10-2023ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవల సినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.రమేష్ బాబు, బి.ఎస్.సి., బి.ఎల్.,
పిటిషనరు / అప్పీలెంటు తరపు అడ్వకేట్
నెల్లూరు, ఎ.పి.,

ఉపకార వేతనాలు చెల్లించాలి

- డాక్టర్ రాజీవ్ నాయక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రయివేటు మెడికల్ కాలేజీలు ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు వెంటనే ఉపకారవేతనాలు చెల్లించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజూడా) సలహాదారు డాక్టర్ ఎం.రాజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్, 2000 రెగ్యులేషన్ 13 ప్రకారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల మాదిరిగా ప్రయివేటు మెడికల్ కాలేజీలు ఉపకారవేతనం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు కూడా ఇది వరకే ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వేతనం ఇవ్వకుండా పని చేయించుకోవడమంటే వెట్టిచాకిరి కిందికే వస్తుందని హెచ్చరించారు. ఈ విషయంపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలు చేర్చండి'

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో టిఎస్‌ఆర్‌టిసి కార్మికుల సమస్యలను చేర్చాలని ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, కార్యదర్శి జక్రయ్య, హైదరాబాద్ రీజినల్ అధ్యక్షులు రంగ కిషన్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలతో కూడిన మూడు పేజీల వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రవళిక ఆత్మహత్యలో గిరిజన యువకుడిని ఇరికించారు

- మాజీ ఎంపి రవీంద్రనాయక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రవళిక ఆత్మహత్య కేసులో సంబంధంలేని గిరిజన యువకుడిని అన్యాయంగా ఇరికించారని మాజీ ఎంపి రవీంద్రనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన ఉద్యోగం కోసం డిసిపి గిరిజన యువకుడిని అన్యాయంగా ఇరికించారని ఆరోపించారు. పోటీ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ అసమర్థత వల్లనే ప్రవళిక ఆత్మహత్య చేసుకున్నదన్నారు. చివరకు ఆమె ఆత్మహత్యను ప్రేమ వ్యవహారంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్రీకరించిందని విమర్శించారు. ఆమె తన చావుకు శివరాం కారణమని ఎక్కడా లేఖలో పేర్కొనలేదని తెలిపారు. ఆమె తల్లిదండ్రులను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని ప్రలోభ పెట్టారనీ, లేని కట్టుకథను అల్లి శివరాంను బలిపశువును చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపితో రాజ్యాంగానికి ప్రమాదం

- దళితుల సమస్యలను ఎన్నికల ఎజెండాలో చేర్చాలి
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపితో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉన్నదనీ, దాని స్థానంలో మను ధర్మశాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు శంకర్ అధ్యక్షతన దళిత, ప్రజాసంఘాలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వెస్లీ మాట్లాడారు. బిజెపిని అధికారంలోకి రాకుండా ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమన్నారు. అట్టడుగు వర్గాలైన దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వం పెత్తందారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ఇష్టం లేదని చెప్పారు. ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్నే ఎత్తేయాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కార్పొరేట్, బహుళజాతి కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం, ప్రభుత్వరంగ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదన్నారు. ప్రయివేట్ రంగంలోని ఉపాధిలో రిజర్వేషన్లను అమలు చేయకపోవడం వలన ఉన్నత విద్య చదివిన దళిత విద్యార్థులు ఉపాధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న భూసేకరణలో దళితుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను లాక్కుంటున్నారనీ, ఇదేనా? దళితుల అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదన్నారు. పెత్తందారుల ఒత్తిడి వలన ఆ చట్టానికి నిధులు తగ్గించారని తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి ఎటుపోయిందని ప్రశ్నించారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రాలేదని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై నడిరోడ్డు మీద పెత్తందార్లు నరికి చంపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. అంటరాని తనం, కుల వివక్షను పాలకులే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధపడటం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, మంత్రి కోనేరు రంగారావు కమిటీ భూ సిఫార్సులను అమలు చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావటం లేదని తెలిపారు. దళితుల సమస్యలను ఎన్నికల ఏజెండాలలో చేర్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, డీబీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నరసింహ, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ తెలంగాణ కోఆర్డినేటర్ శివలింగం, డీబీఎఫ్ రాష్ట్ర నాయకురాలు పులి కల్పన తదితరులు పాల్గొన్నారు

భూ సంస్కరణలను విస్మరించిన ఎన్నికల మేనిఫెస్టోలు

- తెలంగాణ దళిత సంఘాల జెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భూమిలేని 56 శాతం దళితులకు భూ పంపిణీ చేస్తామని ఏ ఒక్క రాజకీయ పార్టీ హామీ ఇవ్వకపోవడం సిగ్గుచేటని తెలంగాణ దళిత సంఘాల జెఎసి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిబిఎఫ్, డిబిఎస్‌యు, పిఎంసిల ఆధ్వర్యంలో '2023 అసెంబ్లీ ఎన్నికలు దళితుల ఎజెండా' పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పిఎంసి రాష్ట్ర కన్వీనర్ ఎస్.శివలింగం, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నర్సింహ, సీనియర్ సామాజిక కార్యకర్త రాంచంద్రయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ భూమి దళితులకు ఆత్మగౌరవం అందిస్తున్నదని తెలిపారు. నిర్లక్ష్యానికి గురవుతున్న దళితుల సమగ్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చకపోవడం తగదని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల పేరుతో పేదలకు గతంలో పంపిణీ చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోబోమని పార్టీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు పది లక్షలకుపైగా ఉన్న కౌలు రైతులకు వ్యవసాయ పథకాలను, రైతుబంధును అమలు చేస్తామని హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భూ సిలింగ్ పరిమితిని పదెకరాలకు తగ్గించాలనీ, భూ హక్కులను హరిస్తున్న ధరణిలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. భూ సంస్కరణలను, భూ అభివృద్ధి పథకాలను అమలు పార్టీలు హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లైన్‌మెన్‌పై కత్తితో దాడికి యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బకాయి ఉండడంతో కరెంట్ సరఫరా కట్ చేసినందుకు లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి కత్తితో బెదిరిస్తూ దాడికి యత్నించాడు. ఈ ఘటన హైదరాబాద్ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురానా హవేలీ ప్రాంతంలోని మహమ్మద్ ఉమర్ చౌదరి ఈ ఏడాది మార్చి నుంచి కరెంట్ బిల్లు చెల్లించట్లేదు. ప్రతినెలా కరెంట్ బిల్లు చెల్లించాలని లైన్‌మెన్ అబ్దుల్ సలీం రోహి అతనికి చెబుతూ వచ్చాడు. అయినా చెల్లించకపోవడంతో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇంటికి కరెంటు సరఫరా నిలిపివేశారు. ఆ ఇంటి వాళ్ళు బిల్లు కడతామని చెప్పడంతో తిరిగి కరెంట్ కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లిన లైన్‌మెన్‌ను యజమాని ఉమర్ తోసేశాడు. కనెక్షన్ ఎలా తొలగిస్తావంటూ తన జేబులో ఉన్న కత్తిని తీసి తల తీసేస్తానంటూ బెదిరించాడు. వెంటనే అక్కడ ఉన్న ఏఈ లైన్‌మెన్‌ను తీసుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

- రేవంత్‌రెడ్డికి ఉద్యోగ, కార్మిక సంఘాల వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆయా పార్టీలు అధికారంలోకి వస్తే కార్మికులకు ఏం మేలు చేస్తారనే అంశాలను తమ మేనిఫెస్టోల్లో పొందుపర్చాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తాము తయారు చేసిన వర్కర్స్ మేనిఫెస్టోలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్మికులకు మేలు చేసే చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డికి వినతిపత్రంతోపాటు వర్కర్స్ మేనిఫెస్టోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా బిఆర్ఎస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంలో కార్మికులకు అనేక హామీలిచ్చి విస్మరించడం పార్టీలకు ఆనవాయితీగా మారిందన్నారు. కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించాయన్నారు. దీనిని పలు పార్టీల అధ్యక్షులకు అందజేస్తామన్నారు. వర్కర్స్ మ్యానిఫెస్టోలోని అంశాలపై కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, మెడిసిన్‌పై జీఎస్టీ ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. వాటన్నింటిపైనా పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సిబ్బందికి ఐడి కార్డులివ్వండి : ట్రెసా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైకోర్టులో కేసు ముగిసినందున విఆర్‌ఎలకు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్లుగా ఐడి కార్డులు కేటాయించాలనీ, వెంటనే జీతాలు చెల్లించాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు సిసిఎల్ఎ, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను వారు కలిశారు. మిట్టల్ సానుకూలంగా స్పందించారనీ, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రమన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జగిత్యాల్ జిల్లా అధ్యక్షులు వకీల్, విఆర్‌ఎలు, ఆఫీస్ సబార్డినేట్లు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన చెరుకు సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, పిసిసి ఉపాధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. శనివారం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మంత్రి హరీశ్‌రావును కలిశారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి వారు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, గాయకుడు ఏపూరి సోమన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.బిసి నేతల విషయంలో పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతల తీరును నిరసిస్తూ డాక్టర్ చెరుకు సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏ పదవీ లేకపోయినా భరించవచ్చు గానీ ఆత్మగౌరవం రాజకీయ ప్రయాణం నిష్ప్రయోజనం అని భావించి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక పరిపుష్టి కలిగిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, మధుయాష్కీ వంటి బిసి నేతల స్థాయిని తగ్గిస్తూ అవమానకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చెప్తున్న సామాజిక న్యాయం కేవలం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ మాటల్లో తప్ప ఆచరణలో లేదని విమర్శించారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బిసిలకు సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ చివరకు మోసం చేసిందని దుయ్యబట్టారు. బిసిలకు కేటాయించిన 12 సీట్లలో ఐదు చోట్ల ఎప్పుడూ కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదని చెప్పారు. వీటిని పట్టుకుని బిసిలకు 12 సీట్లు ఇచ్చామంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెక్కిరింపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పొన్నాల లక్ష్మయ్య రాజీనామా సమయంలో రేవంత్‌రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు

ఓలా,ఉబర్ దోపిడీ భరించలేకున్నాం

- ప్యాసింజర్ల మద్దతు కోరుతూ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఓలా, ఉబర్ సంస్థల తీరుతో క్యాబ్ యజమానులు, డ్రైవర్లు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ అన్నారు. ఈ దోపిడీని ప్యాసింజర్లకు తెలుపుతూ, వారి మద్దతు కోరుతూ రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను శనివారంనాడిక్కడ ఆవిష్కరించారు. ఈ బ్రోచర్లను క్యాబ్‌లో సీట్ల వెనుక ఉంచి, వాటిపై ప్యాసింజర్ల అభిప్రాయాలను ట్విట్టర్ వేదికగా వెల్లడించాలని కోరతామన్నారు. యాప్ ఆధారిత క్యాబ్ సర్వీసుల వల్ల దాదాపు పదివేల మంది నిరుద్యోగ డ్రైవర్లు నానాఅవస్థలు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు కనీస వేతనం హామీ లేదనీ, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగినప్పుడు ప్రోత్సాహకాలను తగ్గిస్తున్నారనీ, డ్రైవింగ్ నిర్వహణ ఖర్చులు, ప్రమాదబీమా వంటి ఎలాంటి రక్షణ చర్యలు యాప్ ఆధారిత కార్పొరేట్ సంస్థలు ఇవ్వట్లేదని వివరించారు. దీనిపై ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ఫెయిర్‌వర్క్ అనే సంస్థ 2020లో చేసిన అధ్యయనం వివరాలను ఈ బ్రోచర్లలో పొందుపర్చామన్నారు.

నూతన అధ్యాపకులకు ఎహెచ్‌ఆర్ఎ, ఎస్‌సిఎ అలవెన్సులివ్వాలి

- డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ కళాశాలల్లో నూతన అధ్యాపకులుగా చేరిన ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు అడిషనల్ హౌస్ రెంట్ అలవెన్స్ (ఎహెచ్‌ఆర్ఎ), స్పెషల్ కంపెన్సెటరీ అలవెన్స్ (ఎస్‌సిఎ) ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ట్రెజరీని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టిజిజెఎల్ఎ-475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్‌తో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. మేలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికిపైగా కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ అయ్యారని వివరించారు. వారు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు కొన్ని జిల్లాల్లో కోశాధికారులు ఏజెన్సీ అలవెన్సులు చెల్లించడంలో ఇబ్బందులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై ట్రెజరీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారనీ, అతి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో నూతన అధ్యాపకుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల ఒకటి, రెండు తేదీల్లో పాఠశాల విద్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయుల బదిలీలు అయ్యాయని తెలిపారు. వారు ఈనెల మూడు నుంచి ఎనిమిదో తేదీ మధ్య బదిలీ అయిన బడుల్లో చేరారని పేర్కొన్నారు. వారికి గతనెల 30 వరకు జీతం బదిలీకి ముందు పాఠశాలలో చెల్లించారని వివరించారు. వారికి చివరి జీతం సర్టిఫికెట్ గతనెల 30 వరకు చెల్లించినట్టు ఈనెల రెండు నుంచి ఏడురోజులపాటు జీతం చెల్లించలేదని నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కొత్త చేరిన పాఠశాల డ్రాయింగ్ ఆఫీసర్ ఈనెల ఒకటి నుంచి బిల్లులు చేసేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ అనుకూలంగా లేదని పేర్కొన్నారు. కావున ఆ పోర్టల్‌లో తగు మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మల్లయ్య, బండి ప్రసాద్, అడపాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్.. ఎలక్షన్ గాంధీ

- ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక రాష్ట్రం కోసం సిఎం కెసిఆర్ 2009లో దీక్ష చేస్తే ఇచ్చినటువంటి తెలంగాణను వెనక్కి తీసుకొని వందలాది బిడ్డల ప్రాణాలను తీసుకున్న ఇటలీ రాణి సోనియాగాంధీ.. బలిదేవత అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. 'కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి కొంచెం సోయి తెచ్చుకొని మాట్లాడాలని సూచించారు. "నన్ను క్వీన్ ఎలిజబెత్ రాణి అని పిలుచుడు కాదు.. నేను మీ ఇటలీ రాణిని కాదు. మీ ఇటలీ రాణి లెక్క వందలాది తెలంగాణ బిడ్డల ప్రాణాలను నేను బలి తీసుకోలేదు. మీరు దిగజారిపోయి హోదాను మరిచిపోయి తెలంగాణకు ప్రతీక అయినటువంటి బతుకమ్మను అవమానించినా కూడా నేను సంయమనంతో మాట్లాడుతున్నాను' అని కవిత వ్యాఖ్యానించారు. జగిత్యాల ప్రజలు జీవన్ రెడ్డిని తప్పకుండా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ బబ్బర్ షేర్ కాదు...ఆయన పేపర్ టైగర్ అని మండిపడ్డారు. శనివారం మెట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ.. నెహ్రూ కాలం నుంచి వాళ్ల కుటుంబానికి తెలంగాణతో అనుబంధం ఉందని రాహుల్ గాంధీ చెబుతున్నారని, తెలంగాణతో రాహుల్ గాంధీ కుటుంబానికి నమ్మకద్రోహపు అనుబంధం ఉన్నదని మండిపడ్డారు. ప్రజా పోరాటాలతోనే 2014లో తెలంగాణ వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రలో కలిపినప్పుడు, హైకోర్టు కావాలని మేము పార్లమెంట్‌లో పోరాటం చేసిననాడు, విభజన హామీల్లో ఒక్క హామీని కూడా బిజెపి ప్రభుత్వం నెరవేర్చకపోతే, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకపోతే, రాహుల్ గాంధీ ఎక్కడున్నారు?అని ప్రశ్నించారు.పార్లమెంటులో సోనియాగాంధీ ఆంధ్రకు రావలసిన హక్కుల గురించి మాట్లాడారు కానీ తెలంగాణ హక్కుల పై మాత్రం మాట్లాడలేదని ఎండగట్టారు. ఆంధ్ర సొమ్ములతో ఉద్యమ సమయంలో జరిగిన ఎన్నికల్లో మద్యం, డబ్బులను అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విచ్చలవిడిగా పంపిణీ చేయించారన్నారు.. ఇదే కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి సిఎం కెసిఆర్‌పై పోటీ చేస్తే కెసిఆర్‌ను ప్రజలు కడుపులో పెట్టుకొని కాపాడుకున్న విషయం వాస్తవం కాదా?అన్నారు. ఒక్క ఎన్నిక గెలవడానికి ఇంత దిగజారి మాట్లాడుతారా? ఇంత అవమానం చేస్తారా? ఉద్యమ సమయంలో నిర్బంధం ఉన్న కాలంలో ఆడబిడ్డలు సగర్వంగా ఆత్మ గౌరవానికి ప్రతీక అని నెత్తిమీద పెట్టుకుని మోసినటువంటి బతుకమ్మను అవమానించిన జీవన్ రెడ్డిని పక్కన పెట్టుకొని రాహుల్ గాంధీ జగిత్యాలలో ముచ్చట్లు చెప్పారు అని కవిత పేర్కొన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి అంటున్నారని, ఈ వ్యాఖ్యలు చూస్తే జీవన్ రెడ్డికి సీనియారిటీ ఉంది కానీ సిన్సియారిటీ లేదన్నది అర్థమవుతోందని విమర్శించారు. 1937లో భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు నిజాం ప్రభువులు షుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారని, అందులో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు.

ఆదివాసీ బిడ్డల మధ్య పోరు

- ములుగు బరిలో సీతక్క, నాగజ్యోతి బిగ్‌ఫైట్
- ఇద్దరిదీ మావోయిస్టు ఉద్యమ నేపథ్యమే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు (ఎస్‌టి) నియోజకవర్గంలో ఇద్దరు ఆదివాసీ బిడ్డల మధ్య ఎన్నికల సమరం ప్రారంభమైంది. అధికార బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారం షురూ అయింది. కాంగ్రెస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే, మహిళా కాంగ్రెస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ధనసరి అనసూయ ఎలియాస్ సీతక్క మళ్లీ రంగంలోకి దిగారు. అధికార బిఆర్ఎస్ అభ్యర్థిగా ములుగు జడ్‌పి చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని ఆ పార్టీ రంగంలోకి దించింది. వీరిద్దరూ ఆదివాసీ మహిళా నేతలే. రాజకీయాల్లో అపార అనుభవం కలిగిన సీతక్కతో నాగజ్యోతి తలపడుతున్నారు. సీతక్క జనశక్తి పార్టీలో అజ్ఞాతదళంలో పనిచేసి తదనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. బడే నాగజ్యోతి కుటుంబ సభ్యులు మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా వున్నారు. ఈసారి ములుగులో గులాబీ జెండా ఎగురవేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్తోంది. మొదటి నుంచీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న సీతక్క అన్నీ తానై పోరాటం చేస్తున్నారు. తొలిదశలోనేఓరాహుల్‌గాంధీ విజయభేరి బస్సు యాత్రను నిర్వహించి పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ఆదివాసీలు అధికంగా ఉన్న నియోజకవర్గం ములుగు. ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క 22 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో బిఆర్ఎస్ ప్రత్యర్థి అజ్మీరా చందూలాల్‌పై విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా రంగంలోకి దిగి సీతక్క తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై 18 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సీతక్క జనశక్తి రాము దళంలో డిప్యూటీ కమాండర్‌గా పనిచేసి లొంగిపోయిన అనంతరం టిడిపిలో చేరారు. బిఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి పీపుల్స్‌వార్ ఏటూర్‌నాగారం దళ కమాండర్ బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ కూతురు కావడం గమనార్హం. నాగజ్యోతి సమీప బంధువు బడే ప్రభాకర్ అలియాస్ దామోదర్ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. నాగజ్యోతి బంధువులు పలువురు మావోయిస్టు పార్టీలో పనిచేసిన సమయంలో ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. ఏదేమైనా రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులది మావోయిస్టు ఉద్యమ నేపథ్యమే కావడం గమనార్హం. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య జరుగబోయే పోరు రసవత్తరంగా మారనుంది. నిత్యం ప్రజల మధ్య వుండే సీతక్క, కోవిడ్ నేపథ్యంలో ఆదివాసీలను అక్కున చేర్చుకున్న నేతగా పేరుండగా, తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తూ గులాబీ జెండా ఎగురవేయడానికి నాగజ్యోతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఏడుసార్లు కాంగ్రెస్ విజయం

ములుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ పార్టీ 7 సార్లు, టిడిపి 4 సార్లు, బిఆర్ఎస్ ఒక్కసారి, పిడిఎఫ్ రెండుసార్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు రెండుసార్లు విజయం సాధించారు. 1962లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి ముసినెపల్లి క్రిష్ణయ్య ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గంలో తొలిసారి రెండుసార్లు ఎమ్మెల్యేగా.. అది కూడా ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచింది సంతోష్ చక్రవర్తి. అనంతరం పోరిక జగన్నాయక్ రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అజ్మీరా చందూలాల్ టిడిపి అభ్యర్థిగా ఒకసారి, రెండోసారి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. పొదెం వీరయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. సీతక్క టిడిపి నుంచి ఒకసారి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

వాచాతి గ్రామ వీర మహిళలకు జేజేలు

- ఆ పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకం
- మద్రాస్ హైకోర్టు తీర్పు అమలు చేయాలి
- అభినందన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమిళనాడులోని ధర్మపురం జిల్లా వాచాతి గ్రామ గిరిజన మహిళల పోరాట విజయానికి ప్రజాసంఘాల నాయకులు జేజేలు చెప్పారు. 31 ఏళ్లపాటు సాగిన ఆ పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. మహిళలకు అనుకూలంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తమిళనాడు ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఐద్వా, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అభినందన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. 'పోరాడదాం వాచాతి గ్రామ మహిళల స్ఫూర్తితో, కొనసాగిద్దాం వాచాతి గ్రామ మహిళల పోరాట స్ఫూర్తిని, మద్రాస్ హైకోర్టు తీర్పును అమలు చేయాలి' అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి మాట్లాడుతూ వాచాతి గ్రామంలో గత 31 ఏండ్ల క్రితం రెవెన్యూ, అటవీ అధికారులు, పోలీసులు కలిసి ఆ గ్రామం మీద దాడి చేసి 18 మంది మహిళలపై సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఈ సంఘటనలో మద్రాసు హైకోర్టు దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు లైంగిక దాడి బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలంటూ ఈ ఏడాది సెప్టెంబర్ 29న తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలంపాటు వీరోచితంగా పోరాడి న్యాయస్థానంలో విజయం సాధించిన మహిళలకు జేజేలు చెప్పారు. ఈ విజయం దేశంలోని దళితులు, గిరిజనులు, పేద వర్గాలపై దాడులు, లైంగిక దాడులు చేసే వారికి ఒక హెచ్చరిక అని అన్నారు. 31 ఏండ్లపాటు చారిత్రాత్మక పోరాటంలో బాధిత ప్రజలకు అండగా నిలిచిన తమిళనాడు రైతు, ట్రైబల్ అసోసియేషన్, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాలకు వారు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు, మూడు శోభన్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి ప్రసాద్, తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత పాల్గొన్నారు.